



గుట్టపై శివలింగానికి అభిషేకం

కిక్కిరిసిన కీసరగుట్ట



అనంతగిరి ఆలయ ఆవరణలో భక్తుల రద్దీ, (ఇన్‌సెట్లో) అడవిలో వనభోజనాలు

- ధర్మ దర్శనానికి గంటల తరబడి క్యూ
- స్పృహ తప్పి పడిపోయిన భక్తురాలు
- అనంతగిరికి పోటెత్తిన భక్తులు
- నేడు చక్రతీర్థంతో పెద్దజాతర ముగింపు
- వనభోజనాలు.. సందడిగా పరిసరాలు

కీసర/వికారాబాద్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కీసర గుట్ట భక్తులతో కిక్కిరిసింది. కార్తీక మాసం, ఆదివారం సెలవురోజు కావడంతో భక్తులు క్షేత్రానికి పోటెత్తారు. దీంతో స్వామివారి ధర్మదర్శనానికి భక్తులు గంటల తరబడి క్యూలో ఉండాల్సి వచ్చింది. ఉదయం గర్భాలయంలోని మూలవిరాట్‌కు శ్రీ మహన్యాస పూర్వకరుద్రాభిషేకంతో పాటు రసాభిషేకం(చెరుకురసం) నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని ఆలయం వెలుపల ఉన్న శివలింగాలకు అభిషేకాలు చేసి, కార్తీక దీపాలు వెలిగించారు. కాగా స్వామివారి దర్శనం ఆలస్యం కావడంతో లాల్‌బజార్‌కు చెందిన అంతట లక్ష్మీ(52) స్పృహ తప్పి పడిపోగా ఆమెకు ప్రథమ చికిత్స అందించారు. కాశీ పీఠాధిపతి శివనాగేంద్ర సరస్వతి స్వామిజీ స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులను అలరించేందుకు గుట్టపై సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతగిరి శ్రీ అనంతపద్మనాభ స్వామి కార్తీక మాస పెద్ద జాతర ఉత్సవాల్లో భాగంగా ఆదివారం భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు అనంతగిరి అడవుల్లో, కీసరగుట్టపై కుటుంబ సమేతంగా సహపంక్తి భోజనాలు చేశారు.



కీసరలో స్వామివారి దర్శనానికి క్యూలో భక్తులు

జిల్లాలో నేడు

అనంతగిరి ప్రదక్షిణ

వికారాబాద్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా అనంతగిరి పెద్ద జాతర నేటితో ముగియనుంది. ఈ క్రమంలో సోమవారం చక్రతీర్థం, అనంతగిరి గిరి ప్రదక్షిణ నిర్వహించనున్నట్లు హిందూ జనశక్తి నాయకులు తెలిపారు. నేడు ఉదయం 5.30 గంటలకు రాజీవ్‌నగర్ భవానీమాత ఆలయం నుంచి గిరి ప్రదక్షిణ ప్రారంభమై బండబావి హనుమాన్ దేవాలయం మీదుగా అనంతగిరికి చేరుకుని పూజ కార్యక్రమాలు నిర్వహించడంతో గిరి ప్రదక్షిణ పూర్తి అవుతుందన్నారు. భక్తులు విజయవంతం చేయాలన్నారు.

రక్తదాన శిబిరం

వికారాబాద్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): శ్రీ సత్యసాయి సేవ సంస్థల ఆధ్వర్యంలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటవరకు రక్తదాన కార్యక్రమం ఉంటుందన్నారు. బస్‌స్టేషన్ సమీపంలో ఈ శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు 9440002109, 9989916290 నెంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

రేపు ప్రమాణ స్వీకారం


మేడ్చల్ టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ మార్కెట్ కమిటీ నూతన కార్యవర్గం ఈనెల 26న ప్రమాణ స్వీకారం చేయనుందని మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులు తెలిపారు. మంగళవారం ఉదయం 11 గంటలకు మార్కెట్ కార్యాలయంలో కార్యక్రమం ఉంటుందన్నారు. కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరు కావాలన్నారు.

ఎదురుచూపులు!

పత్తాలేని కొత్త రేషన్‌కార్డులు

- సర్వే ఆధారంగా ఇచ్చే అవకాశం?
- జిల్లాలో ప్రస్తుతం కార్డుల సంఖ్య 5.23లక్షలు
- విధివిధానాలు ప్రకటించి రెండు నెలలైనా ఊసే లేదు

రెండు నెలల క్రితం కొత్త రేషన్ కార్డుల జారీకి ప్రభుత్వం పచ్చజెండా ఊపడంతో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని అర్హుల్లో కొత్త ఆశలు రేకెత్తాయి. నాలుగేళ్లుగా కార్డుల జారీ నిలిచిపోవడంతో లబ్ధిదారులకు ఎదురుచూపులు తప్పడం లేదు. కొత్తగా పెళ్లైనవారు, కుటుంబంలో జన్మించిన పిల్లల పేర్ల నమోదు, మార్పులు, చేర్పులు, కుటుంబాలు విడిపోయి కొత్తగా కార్డులు పొందాల్సిన వారంతా ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు.



మేడ్చల్ ప్రతినిధి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొత్త రేషన్‌కార్డుల గురించి దరఖాస్తుదారులకు ఎదురుచూపులు తప్పడం లేదు. అక్టోబరు 2నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని ప్రభుత్వం సెప్టెంబరులో ప్రకటించడంతో ప్రజలు ఆశగా ఎదురు చూశారు. మంత్రివర్గంలోనూ మరింత స్పష్టత రావడంతో విధివిధానాలు సైతం ఖరారు చేశారు. ప్రభుత్వం తేదీ ప్రకటించి దాదాపు రెండు నెలలు గడుస్తున్నా.. కొత్త కార్డుల ఊసే లేకపోవడంతో మళ్లీ కార్డుల కథ మొదటికొచ్చింది.

95శాతం కేవైసీ పూర్తి

ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో ఏడాదికి రూ.లక్షన్నర, పట్టణాల్లో రూ. 2 లక్షల ఆదాయం ఉన్న వారికి, అలాగే 3.5 ఎకరాల్లోపు తరి, 7.6 ఎకరాల్లోపు మెట్ట భూములు ఉన్న వారికి కార్డులు జారీ చేస్తున్నారు. నూతన కార్డు జారీలో ఆదాయం పరిమితి పెంపుతో పాటు అర్హతలపై మరోసారి ఆలోచించాకే ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని ప్రకటించారు. కానీ దీనిపై

- మిగతా 8వ పేజీలో..

పర్యవేక్షణకు అధికారులను నియమించాలి



మాట్లాడుతున్న సీహెచ్ వెంకటరత్నం

పరిగి,నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రధానోపాధ్యాయులకు మధ్యాహ్నభోజనం బాధ్యతల నుంచి తప్పించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వెంకటరత్నం అన్నారు. ఆదివారం పరిగిలో జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. తమిళనాడు తరహాలో మధ్యాహ్నభోజన పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించాలని కోరారు. ఏజెన్సీలు చేసే పొరపాట్లకు హెచ్‌ఎంలను బలిచేయడం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి రాములు, జాఫర్‌పల్లి వెంకటయ్య, మోహిజ్‌ఖాన్, బుచ్చయ్య, బసప్ప, దశరథం, గంగాధర్, రమేశ్, ఖాసీం, మేఘ్యా శంకర్‌రావు, శేఖర్ పాల్గొన్నారు.

డాటాఎంట్రీ పకడ్బందీగా నిర్వహించాలి

అదనపు కలెక్టర్ రాధికాగుప్తా

మేడ్చల్ నవంబరు 24(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): సమగ్ర ఇంటింటి సర్వే చివరి దశకు చేరిందని, డాటా ఎంట్రీని పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా అధికారులను ఆదేశించారు. డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరై అనంతరం ఆమె అధికారులతో మాట్లాడారు. డోర్‌లాక్, ఇంటి వద్ద అందుబాటులో లేనివారి వివరాలను ఫోన్ చేసి సేకరించాలన్నారు. పరిశుభ్రతపై దృష్టిసారించాలని ఆదేశించారు.

అప్పులు తీర్చలేక..

భార్యాభర్తల ఆత్మహత్య

వికారాబాద్ జిల్లా యాలాల మండలంలో ఘటన



మాసుల యాదప్ప, జ్యోతి (ఫైల్)

యాలాల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు తాళలేక భార్యభర్తలు పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటన వికారాబాద్ జిల్లా యాలాల మండలంలోని నాగసమందర్ గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. యాలాల ఎస్ఐ శంకర్, గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగసముందర్ గ్రామానికి చెందిన మాసుల యాదప్ప(42), జ్యోతి(39) భార్యభర్తలు. వీరికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. యాదప్ప కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కూతురు శ్రీలతకు రెండేళ్ల కిందట వివాహం చేశారు. అప్పట్లో కూతురు పెళ్లికి అప్పులు చేశారు. రెండేళ్లు గడిచినా అప్పులు తీరకపోవడంతో యాదప్ప, జ్యోతిలు మదనపడేవారు. అప్పులు తీర్చే మార్గం లేక ఇద్దరూ ఆదివారం ఉదయం ఇంట్లో పురుగుల మందు తాగారు. గమనించిన వారి కుమారుడు సందీప్ చుట్టుపక్కల వారికి తెలిపాడు. దీంతో వారిని వైద్యం నిమిత్తం తాండూరులోని జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌కు మెరుగైన చికిత్స నిమిత్తం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. మృతదేహాలను పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించినట్లు ఎస్ఐ శంకర్ తెలిపారు. ఈమేరకు మృతుల కూతురు శ్రీలత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నటు తెలిపారు.

మౌలిక వసతులు కల్పించాలి



సమావేశానికి హాజరైన లబ్ధిదారులు

కీసర రూరల్, నవంబర్ 24 (ఆంధ్రజ్యోతి): మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ దమ్మాయిగూడ మున్సిపాలిటీ అహ్మద్‌గూడలోని డబుల్ బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారులు ఆదివారం సముదాయాల వద్ద ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డబుల్‌బెడ్ రూం ఇళ్లను కేటాయించి 14 నెలలు గడుస్తున్నా ప్రభుత్వం మౌలిక వసతులు కల్పించటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. లిఫ్టులు పని చేయటంలేదని, సంపుల్లో మోటార్లు బిగించలేదని, పలు ప్లాట్లలో వైరింగ్ చోరీ అయిందని వెలిబుచ్చారు. మౌలిక వసతులు కల్పించకుండానే ఇళ్లల్లో నివసించాలని లేని యెడల ఇంటి మంజూరును రద్దు చేస్తామని అధికారులు హెచ్చరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మౌలిక వసతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో విజయ్ కుమార్, పరశురాం, వెంకటేశ్వర్లు, వెంకటేష్, నర్సింగ్, జాన్, రవి, చందు, జాన్సీ, హబీసుల్తానా, తదితరులు పాల్గొన్నారు.

'సన్నాల'కు భలే డిమాండ్!

- మార్కెట్‌లోకి వస్తున్న కొత్తబియ్యం
- ధాన్యాన్ని బియ్యంగా మార్చి విక్రయిస్తున్న రైతులు
- మిల్లుల వద్దే ఎగబడి కొంటున్న వ్యాపారులు
- ఒక్కసారిగా పెరుగుతున్న ధరలు



7

ఆస్తి పన్నుకు ఎగనామం!

- రెండేళ్లుగా కొనసాగుతున్న తంతు
- ప్రభుత్వ భూమిలోనే కొనసాగుతున్న క్రషర్
- పట్టించుకోని అంతారం పంచాయతీ అధికారులు



7

నాడు వినియోగం.. నేడు విస్మరణ

- డంపింగ్ యార్డులో పేరుకుపోతున్న చెత్త
- తాండూరులో రోజూ 50మెట్రిక్ టన్నుల సేకరణ
- గతంలో ఈ ప్రాంతంలో పార్కు



8

నిబంధనలకు పాతర!

- నాగారం మున్సిపల్ పరిధిలో జోరుగా అక్రమ నిర్మాణాలు
- విలీన గ్రామాల్లో అనుమతుల్లేకుండా కట్టడాలు
- తమకేం సంబంధం లేదంటున్న పంచాయతీ అధికారులు
- చర్యలు తీసుకోని మున్సిపల్ అధికారులు



కరీంగూడ ఓమౌజా: ఆశ్రమం ముందు అక్రమ నిర్మాణాలు

కీసర, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): అక్రమ నిర్మాణదారులకు మున్సిపాలిటీలో పంచాయతీల విలీనం ఓ వరంగా మారింది. పంచాయతీల్లో అక్రమాలపై కార్యదర్శులు, సర్పంచ్‌లు ఎప్పటికప్పుడు పర్యవేక్షించేవారు. ప్రస్తుతం మునిసిపాలిటీలో విలీనమైన గ్రామాల పరిస్థితి అగమ్యగోచరంలా మారింది. ఇటు పంచాయతీలు, అటు మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ లేక అక్రమార్కులకు అవకాశంలా మారింది. విలీన గ్రామాల్లో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. మున్సిపల్ కమిషనర్‌కు సైతం ప్రభుత్వం పూర్తి బాధ్యతలప్పగించక వారు కూడా చర్యలేమీ తీసుకోలేకపోతున్నారు. వెరసి అక్రమ నిర్మాణాలు నిరాఘాటంగా కొనసాగుతున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. నాగారంలో మున్సిపల్ పరిధిలోని రాంపల్లిదాయర, కరీంగూడ, గోధుమకుంట గ్రామాలల్లో జోరుగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి. గ్రామపంచాయతీలుగా ఉన్న గ్రామాలను ఇటీవల నాగారం మున్సిపల్ పరిధిలో విలీనం చేయడం జరిగింది. అధికారులు అక్రమ నిర్మాణాలపై, ఆదాయాలపై, పన్నుల వసూళ్లు, పారిశుధ్య పనులు, కార్మికుల జీత భత్యాలు ఇలా ఏ అంశాలకు పరిష్కార మార్గాలు చూపకుండా తొందరపడి విలీనం చేశారు. ఇదే అదునగా అక్రమార్కులు ఇష్టానుసారంగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. కరీంగూడ నాగారం మున్సిపాలిటీలో విలీనమైంది. అప్పటి నుంచి నేటి వరకు గ్రామంలో పారిశుధ్యం, మంచినీటి సరఫరా, ఇతర సదుపాయాల కల్పన మొత్తం మున్సిపాలిటీ ఆధ్వర్యంలోనే జరుగుతున్నాయి. కానీ మున్సిపాలిటీకి ఆదాయాన్ని చేకూర్చే నిర్మాణ అనుమతులపై మాత్రం కమిషనర్ గానీ, చైర్మన్ గానీ పట్టించుకోవడం లేదు. నిర్మాణాల నిలిపివేతకు, అనుమతులకు తమకు అధికారాలు లేవని అధికారులు పేర్కొంటున్నారు. కరీంగూడలోని ఓమౌజా: ఆశ్రమం వద్ద ఓ భారీ షెడ్డును అక్రమంగా నిర్మిస్తున్నారు. ఎకరం స్థలంలో అనుమతి లేకుండా నిర్మాణాలు చేపడుతున్నారు. ఫాంహౌస్ తరహాలో నిర్మాణాలు చేస్తున్నట్టు స్థానికులు చెబుతున్నారు. అలాగే పాత పంచాయతీ పరిధిలోని చేపడుతున్న షాపింగ్ కాంప్లెక్స్‌లు, నివాస ఇళ్లకు సైతం అనుమతులు తీసుకోవడం లేదు. వీటిపై చర్యలు తీసుకునే అధికారులే లేకుండా పోయారు. ఇలాంటి వాటిపై స్థానిక అధికారి తిరుపతిని స్పందన కోరగా.. ఆశ్రమం వద్ద నిర్మాణాలకు అనుమతుల్లేవని, అలాగే నియంత్రణకు అధికారం కూడా తమకు లేవని చెప్పాడు. పట్టణంలో కొత్తగా చేపడుతున్న నిర్మాణాలకు కూడా ఎక్కడ అనుమతులు తీసుకుంటున్నారో.. ఎవరు అనుమతులు ఇస్తున్నారో తెలియడం లేదని పేర్కొన్నారు. వ్యాపార నిర్మాణాల

- మిగతా 8వ పేజీలో..



కంకర తేలిన ధారూరు -రుద్రారం రోడ్డు

రహదారి.. అధ్వానం

తరచూ ప్రమాదాలు..రాకపోకలకు ఇబ్బందులు

ధారూరు, నవంబరు24 (ఆంధ్రజ్యోతి): ధారూరు నుంచి ఈద్గావైపు వెళ్లే తారు రోడ్డు కంకరతేలి అధ్వానంగా మారింది. వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నిర్మించిన ఈరోడ్డుపై తారు లేచిపోయి కంకర తేలి గుంతలమయంగా మారింది. మున్నూర్ సోమారం నుంచి సుద్దలోడుతో పెద్దపెద్ద లారీలు, ఇతర వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ మార్గంలో అధిక లోడ్‌తో సుద్ద లారీలు, సిమెంట్ లారీలు వెళ్తుండడంతో రోడ్డుపై కంకర తేలి ప్రమాదకరంగా మారింది. ఈమార్గంలోనే నూతన రైస్ మిల్లు, మిషన్ భగీరథ ట్యాంకు, ఈద్గా, డబుల్‌బెడ్ రూం ఇళ్లు, వైకుంఠధామాలు ఉన్నాయి. ధారూరు నుంచి రుద్రారం, నాగసమందర్ గ్రామాల వైపు వెళ్లే వారు రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డుపై కంకర తేలి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికైనా రోడ్డు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

శిథిలావస్థలో ట్యాంకు



దుద్యాల్ మండలపరిధి హస్నాబాద్‌లో గ్రామంలో నీటిట్యాంకు శిథిలావస్థకు చేరింది. పాఠశాల ఆవరణలో నీటి ట్యాంకు ఉండటంతో ఎప్పుడు కూలుతుందోనని స్థానికులు భయపడుతున్నారు. గతంలో పలు మార్లు అధికారుల దృష్టికి తేగా, ట్యాంకు కూల్చివేతకు అనుమతులు ఇచ్చినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ట్యాంకును కూల్చి, దాని స్థానంలో కొత్త ట్యాంకు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

- కొడంగల్ రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి)

శిలాఫలకంలో కనిపించని అటవీశాఖ మంత్రి పేరు

జిల్లాలో ఫారెస్ట్ అధికారుల తీరుపై చర్చ



మంత్రి కొండా సురేఖ పేరు లేకుండా ఏర్పాటు చేసిన శిలాఫలకం

వికారాబాద్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి) : అనంతగిరి అడవుల్లో చేపట్టనున్న ఫారెస్ట్ అర్బన్ పార్క్ శంకుస్థాపన, రూ.25 లక్షలతో నూతనంగా నిర్మించిన ఫారెస్ట్ సెక్షన్ అధికారి కార్యాలయాన్ని శనివారం స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రారంభించారు. అయితే శంకుస్థాపన కార్యక్రమంలో సంబంధిత శాఖ మంత్రి కొండా సురేఖ పేరు లేకపోవడం ప్రస్తుతం చర్చనీయంశంగా మారింది. స్పీకర్‌తో పాటు జిల్లా ఇన్‌చార్జిగా మంత్రిగా ఉన్న శ్రీధర్‌బాబు, ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి, ప్రభుత్వ చీఫ్‌విప్ మహేందర్ రెడ్డి పేరు ఉన్నప్పటికీ మంత్రి కొండా సురేఖ పేరు లేక పోవడం ఏమిటని అధికారుల తీరుపై మండి పడుతున్నారు.

సీపీఎం జిల్లా మహా సభలను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

చేవెళ్ల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): డిసెంబర్ 11, 12 తేదీలలో జరిగే సీపీఎం జిల్లా మహా సభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.జగదీశ్ కోరారు. ఆదివారం చేవెళ్ల మండల కేంద్రంలోని అంబేడ్కర్ భవన్‌లో పార్టీ ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం పని చేస్తామన్నారు. రానున్న రోజుల్లో పేద ప్రజల సమస్యలపై నిర్విరామంగా అనేక ఉద్యమాలు నిర్మించాలని పిలుపునిచ్చారు. చేవెళ్లలో సీపీఎం పార్టీని బలోపేతం చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. అనంతరం చేవెళ్ల డివిజన్ కమిటీ కార్యదర్శిగా అల్లిదేవేందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మరో 8 మంది సభ్యులను డివిజన్ కమిటీ సభ్యులుగా ఎంపిక చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కుమార్, ఎర్రవల్లి శ్రీనివాస్, స్వామిగౌడ్, తేజ, పవన్ కుమార్, జంగయ్య, జుబేర్, మహేశ్, సాయిబాబా తదితరులు ఉన్నారు.

ఎన్నికల హామీలను మరచిన కాంగ్రెస్

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రుద్రకుమార్



కరపత్రం విడుదల చేస్తున్న రుద్రకుమార్

శంషాబాద్, నవంబరు 24 (ఆంధ్యజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోలేదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రుద్ర కుమార్ అన్నారు. శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలో ఆదివారం ఆ సంఘం శంషాబాద్ మున్సిపల్ శాఖ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌ను సవరించాలన్నారు. నాలుగు లేబర్ కోడ్స్, విద్యుత్ సవరణ బిల్లు-2022ను రద్దు చేయాలన్నారు. కార్మికులందరికీ కనీస వేతనం రూ.25 వేలు, పింఛను రూ.10 వేల చొప్పున చెల్లించాలన్నారు. అలాగే కార్మికుల సమస్యల పరిష్కారానికి రేపు ఇందిరాపార్కు వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలన్నారు. ఈ మేరకు ఆయన కార్మికులతో కలసి కరపత్రం విడుదల చేశారు. కార్యక్రమంలో ప్రవీణ్, పవన్‌కుమార్, యాదమ్మ, ఇందిరా ఆర్. రవి తదితరులు పాల్గొన్నారు. కాగా, ఈ కార్యక్రమానికి ఆ సంఘం నాయకుడు నీరటి మల్లేశ్ అధ్యక్షత వహించారు.

ఐకమత్యం, స్నేహభావానికి క్రీడలు దోహదం



పోటీలను ప్రారంభిస్తున్న ఏసీపీ రాజు. పక్కన మంచాల సీఐ మధు

మంచాల, నవంబర్ 24(ఆంధ్రజ్యోతి): ఐకమత్యం, స్నేహభావానికి క్రీడా పోటీలు దోహదపడతాయని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు అన్నారు. మంచాల మండల పరిధిలోని ఆరుట్లలో ఏపీఎల్ క్రికెట్ పోటీలను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసీపీ రాజు మాట్లాడుతూ చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ యువతీయువకులు డ్రగ్స్ నియంత్రణకు సహకరించాలని కోరారు. గెలుపోటములను సమస్థాయిలో స్వీకరించాలని కోరారు. కార్యక్రమంలో మంచాల సీఐ మధు, మాజీ సర్పంచ్ కొంగర విష్ణు వర్ధన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీలు చీరాల రమేష్, కావలి శ్రీనివాస్, గుడ్డిమల్ల చంద్రయ్య, మార సురేష్, అంతటి రాజు, మార బుగ్గరాములు, ఆర్ల శ్రీనివాస్, కె.భాస్కర్, బుట్టి కృష్ణ, వస్పరి కుమార్, వెదిరె సికిందర్‌రెడ్డి, రావుల రాఘవ, సూర్యం, శ్రవణ్, చీమర్ల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పనకు కేంద్రం కృషి



చేపల పెంపక కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఉత్తరాఖండ్ మంత్రి సౌరభ్ బహుగుణ

కందుకూరు,నవంబరు 24(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనకు కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, అన్ని సంక్షేమ పథకాలను యువత సద్వినియోగం చేసుకోవాలని ఉత్తరాఖండ్ రాష్ట్ర పశుసంవర్థక, మత్స్యశాఖ మంత్రి సౌరబ్ బహుగుణ సూచించారు. మండంలోని గూడూరు గేటు వద్ద అత్యాధునికంగా చేపల పెంపక కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. కాగా, ఆదివారం ఆయన కేంద్రాన్ని సందర్శించి చేపల పెంపకపై నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ పెరిగిన చేపలను ఏ మార్కెట్‌లో అమ్మకాలు చేసునే అవకాశాలు ఉన్నాయని ఆయన తెలుసుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెడుతున్నట్లు ఆయన గుర్తు చేశారు. బీజేపీ నేతలు సౌరబ్‌బహుగుణకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహరెడ్డి, మాజీ అధ్యక్షుడు అంజన్‌కుమార్‌గౌడ్, నాయకులు నాగేష్, శ్రీరాములు, నర్రరవికుమార్, అభిషేక్, మండల క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

సన్నాలకు భలే డిమాండ్!

- మార్కెట్‌లోకి వస్తున్న కొత్తబియ్యం
- ధాన్యాన్ని బియ్యంగా మార్చి విక్రయిస్తున్న రైతులు
- మిల్లుల వద్దే ఎగబడి కొంటున్న హోల్‌సేల్ వ్యాపారులు
- ఒక్కసారిగా పెరుగుతున్న ధరలు



రైస్‌మిల్లు వద్ద వడ్లు పట్టించటానికి వచ్చిన వాహనాలు



మేడ్చల్ టౌన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన వానాకాలం వరి ధాన్యం ఇప్పుడిప్పుడు మిల్లులకు చేరుకుంటోంది. కొద్ది రోజులుగా రైతులు పంటలను కోసి ఎండబెట్టి వాహనాల్లో రైస్‌మిల్లులకు తరలిస్తున్నారు. దీంతో ఇప్పుడిప్పుడే కొత్త బియ్యం మార్కెట్‌లో తీసుకొస్తున్నారు. దీంతో కొత్త బియ్యం ధరలకు ఒక్కసారిగా రెక్కలు వచ్చాయి. ఒక వైపు ప్రభుత్వం సన్నాలకు బోనస్ ఇస్తున్నా.. మార్కెట్‌లో డిమాండ్ నేపథ్యంలో రైతులు ధాన్యాన్ని మిల్లర్ల వద్ద పట్టించి డిమాండ్‌కు తగ్గట్టుగా మార్కట్‌లో విక్రయిస్తున్నారు. దీంతో కొత్త బియ్యం కొనుక్కునేందుకు వినియోగదారులు మిల్లుల బాటపడుతున్నారు. వారం రోజులుగా మండలంలోని రైతులు బియ్యం పట్టిచడానికి ధాన్యాన్ని పెద్ద ఎత్తున రైస్‌మిల్లులకు తరలిస్తుండటంతో ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు మిల్లులు పని చేస్తున్నాయంటే అతిశయోక్తి కాదు.

ఆరబెట్టేందుకు అవస్థలు

మేడ్చల్ మండలంలో బియ్యం పట్టించే రైతులకోసం నాలుగు రైస్‌మిల్లులు అందుబాటులో ఉన్నాయి. కాగా ఈ రైస్‌మిల్లుల వద్ద కల్లాలు సరిగా లేక పోవడంతో చాలా మంది రైతులు తమ వడ్లు ఎండబెట్టుకోవడానికి నానా ఇబ్బందులు పడుతున్నారు. దీంతో చాలా మంది రైతులు తమ వ్యవసాయ పొలాల వద్ద ఉన్న రోడ్డుల పై, మైదానాల్లో వడ్లు ఆరబోసుకున్న అనంతరం రైస్ మిల్లులకు తరలిసున్నారు. మండలంలో దాదాపుగా వరికోతలు పూర్తి కావడంతో రైతులు తమకు అందుబాటులో ఉన్న రైస్‌మిల్లర్ల వద్దకు వెళ్లి వడ్లు పట్టించుకుంటున్నారు.



పొలం వద్ద బండపై ఆరబోసిన సన్న ధాన్యం

గంపగుత్తగా కొనుగోళ్లు

సన్నరకంలో కొన్ని బియ్యానికి పెద్ద ఎత్తున డిమాండ్ ఉండటంతో వాటిని పండించిన రైతులు రైస్‌మిల్లుల వద్దే అమ్ముకుంటున్నారు. ప్రధానంగా సన్నరకానికి చెందిన చింట్లు, హెచ్‌ఎండీ, శ్రీరామ్ తదితర రకాల బియ్యానికి ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటాల్‌కు రూ.5000-6000 ధర పలుకుతుండటంతో రైతులు వడ్లు పట్టించిన వెంటనే రైస్ మిల్లుల వద్దే విక్రయిస్తున్నారు. కాగా, డిమాండ్ ఉన్న బియ్యాన్ని బియ్యం వ్యాపారస్తులు గంపగుత్తగా పెద్ద ఉత్తన కొనుగోలు చేసి నిల్వ చేసుకుంటున్నారు. దీనికి తోడు ప్రైవేటు హాస్టళ్ల నిర్వాహణ, హోటళ్ల నిర్వాహకులు సైతం పెద్ద ఎత్తున బియ్యం కొనుగోలు చేస్తున్నారు.

భూగర్భ మురుగుకాల్వ ప్రారంభం



చౌదరిగూడలో భూగర్భ డ్రైనేజీని ప్రారంభిస్తున్న కొండల్‌రెడ్డి

ఘట్‌కేసర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కాలనీవాసులు ముందుకు వచ్చి స్వచ్ఛందంగా భూగర్భ మురుగుకాల్వను నిర్మించుకోవడం అందరికీ ఆదర్శమని పోచారం మున్సిపల్ ఛైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి అన్నారు. ఆదివారం చౌదరిగూడ వెంకటాద్రి టౌన్‌షిప్ కాలనీ ఫేజ్ 2లో స్థానికులు కలిసి నిర్మించుకున్న డ్రైనేజీని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీయే పనిచేయాలని ఎదురు చూడకుండా స్థానికులే ముందుకు వచ్చి రూ.70వేలు వెచ్చించి డ్రైనేజీ నిర్మాణానికి శ్రీకారం చుట్టడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రవీందర్ గౌడ్, కాలనీవాసులు శ్రీకాంత్‌రెడ్డి, రాజశేఖర్, రవీందర్, నవీన్, మనోజ్‌కుమార్, ఆనంద్, స్థానికులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్తి పన్నుకు ఎగనామం!

- రెండేళ్లుగా కొనసాగుతున్న తంతు
- ప్రభుత్వ భూమిలోనే కొనసాగుతున్న క్రషర్
- పట్టించుకోని అంతారం పంచాయతీ అధికారులు



తాండూరు రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఓ క్రషర్ వ్యాపారి పంచాయతీకి చెల్లించాల్సిన ఆస్తిపన్నుకు ఎగనామం పెట్టారు. రెండేళ్లగా ఇదే తంతుకోనసాగుతున్నా క్రషర్ యజమానిపై చర్యలు తీసుకోవడం లేదు. వివరాల్లోకి వెళితే.. మండల పరిధిలోని అంతారం పంచాయతీ పరిధిలో ప్రభుత్వ భూమి లావుని పట్టా సర్వే నంబర్-58/3, 58/4లో జరీనా స్టోన్ యజమాని దళితుల నుంచి భూమిని కొనుగోలు చేశాడు. అక్కడే క్రషర్ నిర్మించి పెద్ద ఎత్తున భవన నిర్మాణం కూడా చేపట్టాడు. అయితే వ్యాపారి ఆరు ఎకరాల్లో కర్మాకారం కొనసాగిస్తుండగా, పక్కనే ఉన్న మరో మూడు ఎకరాలపై కన్నేసి ఆ భూమిని కూడా తన ఆధీనంలోకి తీసుకుని వ్యాపారం చేస్తున్నాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు గత రెండు రోజుల క్రితం అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో రెవెన్యూ సర్వేయర్‌తో సర్వే చేయించారు. దీంతో అసలు విషయం బయటపడింది.



కర్మాగారంలో భారీ వాహనం

రెండు కర్మాగారాల కొనసాగింపు

అంతారం పంచాయతీలో రెండు క్రషర్ స్టోన్ మిషన్లు, భారీ భవనాలు నిర్మించారు. అంతేకాకుండా తప్పుడు పత్రాలతో యజమాని పంచాయతీకి పైసా ఆస్తిపన్ను చెల్లించకుండా ఎగ నామం పెడుతున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ఇతర ప్రాంతాల నుంచి నాపరాతి గుండ్లను భారీ వాహనాల ద్వారా కర్మాగారానికి తీసుకువచ్చి వేగింగ్ చేసిన తర్వాత కర్మాగారంలోకి తీసుకెళ్తారు. వేగింగ్ మిషన్ ఏర్పాటుకు సైతం పంచాయతీ అనుమతి లేకుండానే ఏర్పాటు చేశారు. ఇంత జరుగుతున్నా జరీనా స్టోన్ క్రషర్ పై అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో ఆ వ్యాపారి ఇష్టారాజ్యంగా పంచాయతీ, ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. కలెక్టర్, పంచాయతీ అధికారి స్పందించి అక్రమాలకు పాల్పడిన వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



యాత్రికులకు సెండాఫ్ ఇస్తున్న కుటుంబ సభ్యులు

ఉమ్రా యాత్రకు 50 మంది యాత్రికులు

శంషాబాద్ రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి యాత్రికులు ఉమ్రా యాత్రకు బయలుదేరి వెళ్లారు. వారి కుటుంబ సభ్యులు, బంధువులు ఆదివారం ఎయిర్‌పోర్టులో వారికి ఘనంగా సెండాఫ్ ఇచ్చారు. అల్ మిజన్ టూర్స్ అండ్ ట్రావెల్స్ మేనేజింగ్ డైరెక్టర్ మహ్మద్ ఫయాజ్ అలీ అధ్వర్యంలో 50 మంది యాత్రికులు ఉమ్రాకు వెళ్లారు. మేనేజింగ్ డైరెక్టర్ ఫయాజ్ అలీ మాట్లాడుతూ ప్రతీ ముస్లిం జీవితంలో ఒక్కసారైన మక్కా, మదీనాలను సందర్శించి ప్రత్యేక ప్రార్ధనలు చేస్తే జీవితం ధన్యమైనట్లని చెప్పారు. ఈ యాత్రలో తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర, అలాగే యూఎస్, కెనడా దేశాలకు చెందిన ముస్లిం సోదరులు అల్ మిజన్ టూర్స్ అండ్ ట్రావెల్స్ ద్వారా ఈ యాత్రకు వస్తున్నారని ఆయన చెప్పారు. పవిత్ర ప్రార్ధన మందిరాలను సందర్శించడం, ప్రార్ధనాలు చేయడం అదృష్టంగా భావిస్తామని చెప్పారు. ఈ సంస్థ గత 30 ఏళ్ల నుంచి కొనసాగుతోందని చెప్పారు. యాత్రికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని జాగ్రతలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో జాయిద్ ఉద్దీన్‌తో పాటు బ్రాంచీ మేనేజర్ జీఎం ఖాన్ ఉన్నారు.



● వ్రత వైభవం

కార్తీకమాసం సందర్భంగా శంకర్‌పల్లిలోని డీఎమ్‌ఆర్ గార్డెన్‌లో నిర్వహించిన సామూహిక సత్యనారాయణ వ్రతాలు వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సామాజిక సమరసత రాష్ట్ర కన్వీనర్ అప్పలరాజు మాట్లాడుతూ సామూహిక వ్రతాలు పెద్ద ఎత్తున నిర్వహించడం అభినందనీయమన్నారు. కులాలకు అతీతంగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం శుభపరిణామమన్నారు. 132 మంది దంపతులు ఇక్కడ ఒకే సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించడం గమనార్హం.

- శంకర్‌పల్లి, నవంబరు24(ఆంధ్రజ్యోతి)

రైతుల సంక్షేమానికి పెద్దపీట



శ్రీశైలంను సన్మానిస్తున్న నాయకులు

ఆమనగల్లు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని మార్కెట్ కమిటీ డైరెక్టర్ వస్పుల శ్రీశైలం అన్నారు. ఆమనగల్లు మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా నియమితులైన వస్పుల శ్రీశైలంనకు ఆదివారం ఆమనగల్లు పట్టణంలో నవయూత్ కాలనీ మైసమ్మ దేవాలయం వద్ద కాలనీ వాసులు అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీశైలం ను పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో జానయ్య, బాల్‌రాజ్, అశోక్, కృష్ణ, వస్పుల గిరి, మహేశ్, గిరి, మహేందర్, కొమ్ము నర్సింహ, వగ్గు శ్రీను, పాలె ప్రవీణ్, జగదీశ్, మహేందర్, బాల్‌రామ్, బాబు, వెంకటేశ్, వస్పుల శ్రీకాంత్, శివ, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ధ్యానం చేయాలి



శైలజా రామయ్యర్‌ను సన్మానిస్తున్న ఫౌండర్లు

వికారాబాద్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ విధిగా ధ్యానం నేర్చుకోవాలని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ తెలిపారు. ఆదివారం కోట్‌పల్లి మండలంలోని క్వాంటం లైఫ్ ఫౌండేషన్‌లో నిర్వహించిన బ్రహ్మ జ్ఞాన దివస్ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అందరు ధ్యానం గురించి తెలుసుకోవాలని సూచించారు. క్వాంటం లైఫ్ ఫౌండేషన్ ఫౌండర్లు డాక్టర్ న్యూటన్, డాక్టర్ లక్ష్మి ఏర్పాటు చేసిన ఈ ధ్యాన కేంద్రం ద్వారా ప్రపంచమే ఇక్కడ వైపు చూసేలా చేశారని కొనియాడారు. డాక్టర్ న్యూటన్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ ప్రకృతిని ప్రేమించాలన్నారు. కార్యక్రమంలో సినీనటి రెజీనా, బీజేపీ నేత విజేందర్ గౌడ్, భాస్కర్ రెడ్డి, లక్ష్మీన్యూటన్ తదితరులు పాల్గొన్నారు.

మండల కేంద్రం చేసేవరకూ పోరాడతాం

తలకొండపల్లి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించే వరకూ పోరాటం కొనసాగిస్తామని జేఏసీ నాయకులుబ అశోక్ గౌడ్, శరత్‌చంద్ర, ఆంజనేయులు తెలిపారు. ఈ రిలే నిరాహార దీక్షలు ఆదివారంతో 24వ రోజుకు చేరాయి. దీక్షలకు మద్దతుగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏదుల జంగయ్య, కృష్ణయ్య, లక్ష్మీపతి, నెహ్రూ, లక్ష్మణ్‌నాయక్, దాసు, మల్లయ్య, రాజు పాల్గొన్నారు.

మాలల సింహగర్జనను విజయవంతం చేయాలి

మాలల ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు బాలకిషన్

మహేశ్వరం, నవంబరు24 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా డిసెంబరు 1న లక్షలాది మందితో సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో జరగనున్న మాలల సింహగర్జన భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని మాలల ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు బేర బాలకిషన్ కోరారు. ఆదివారం మండలంలోని మన్‌సాన్‌పల్లి చౌరస్తాలో మహేశ్వరం మండల మాల మహానాడు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణాలో 30 ఏళ్లుగా ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందనీయకుండా పాలకులు తీరని అన్యాయం చేశారని మండిపడ్డారు. మనువాద మందకృష్ణ మాటలు నమ్మి కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మాలలను అనేక రకాలుగా నిర్లక్ష్యానికి గురి చేశాయన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా బీజేపీకి ఓటు వేయాలని ప్రచారం చేసిన మందకృష్ణ నిజస్వరూపం తెలుసుకోవాలన్నారు. అన్నదమ్ముల్లా ఉన్న మాల, మాదిగల మధ్య చిచ్చు పెట్టి రిజర్వేషన్లు ఎత్తి వేయాలని కుట్రలు చేస్తున్న మంద కృష్ణమాటలను రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం గమనించాలన్నారు. డిసెంబరు 1న జరగబోయే సింహగర్జన కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు మహేశ్వరం నియోజకవర్గంలోని మాలలు వేలాదిగా తరలిరవాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల మాల మహానాడు నాయకులు ఏకుల రాములు, రాజేష్, జంగయ్య, ముత్యం, ఉపేందర్, జనార్ధన్, కన్నయ్య, శ్రీనివాస్, రాఘవేందర్, ప్రకాష్, గోవర్ధన్ తది తరులు పాల్గొన్నారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న మాల మహానాడు నాయకులు

రైతులు బీఆర్ఎస్ మాయలో పడొద్దు



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

బొంరాస్‌పేట్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): లగచర్ల ప్రాంతంలో వచ్చేది ఫార్మా కాదని, ఇండస్ట్రియల్ కారిడార్ అని కాంగ్రెస్ మండల నాయకులు తెలిపారు. ఆదివారం వారు బొంరాస్‌పేట్‌లో విలేకరులతో మాట్లాడుతూ రైతుల్లో నెలకొన్న అపోహలను తొలగించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన చేసినట్లు తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సిములు గౌడ్ మాట్లాడుతూ రైతులు బీఆర్ఎస్ నాయకుల మాయలో పడొద్దని కోరారు. రైతులను రెచ్చగొడుతూ అధికారులపై ఉసి గొల్పి కేసీఆర్, కేటీఆర్ పబ్బం గడుపుకుంటున్నట్లు ఆరోపించారు. రైతులను రెచ్చగొట్టి కొడంగల్ అభివృద్ధి నిరోధకులుగా మారారన్నారు. రైతులు, ప్రజలు గమనించి ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. సమావేశంలో నాయకులు వెంకట్రాములుగౌడ్, రాంచంద్రారెడ్డి, మల్లికార్జున్, కృష్ణ, గోవర్ధన్‌రెడ్డి, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

కార్తీక వనభోజనాలతో మంచి ఆరోగ్యం

రాష్ట్ర సగర సంఘం అధ్యక్షుడు శేఖర్‌సాగర్



వనభోజన మహోత్సవంలో మాట్లాడుతున్న శేఖర్‌సాగర్

మహేశ్వరం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలో వన భోజన కార్యక్రమం అన్ని విధాల ఆరోగ్యానికి మంచిదని రాష్ట్ర సగర సంఘం అధ్యక్షుడు శేఖర్‌సాగర్ అన్నారు. ఆదివారం జిల్లా సగరసంఘం ఆధ్వర్యంలో తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో కార్తీక వన భోజన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పల్లెల్లో ఈ వన భోజన కార్యక్రమాలు నిర్వహించేవారని హిందూ పురాణాల్లో ఇతిహాసాల్లో కూడా ఈ ప్రస్తావన ఉందన్నారు. సగరులను సంచార జాతిగా గుర్తించి బీసీ- డీ నుంచి బీసీ- ఏలోకి మార్చాలన్నారు. గత ప్రభుత్వాలు కొంత మేరకు హామీలు ఇచ్చినా ఆ హామీలు అమలు కాలేదన్నారు. సగరుల కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదే విధంగా రాష్ట్ర బడ్జెట్లో సగరుల అభ్యున్నతికి ప్రత్యేక ప్యాకేజీ ఏర్పాటు చేయాలని అన్నారు. కార్యక్రమంలో సగర సంఘం నాయకులు హరికిషన్, సుధాకర్, సత్యం, సురేష్, శ్రీకాంత్, రవి, పల్లవి, జయమ్మ తధితరులు పాల్గొన్నారు.

నాడు వినియోగం.. నేడు విస్మరణ

- డంపింగ్ యార్డులో పేరుకుపోతున్న చెత్త
- తాండూరులో రోజూ 50మెట్రిక్ టన్నుల సేకరణ
- గతంలో ఈ ప్రాంతంలో పార్కు


2019లో డంపింగ్ యార్డు వద్ద ఏర్పాటు చేసిన పార్కు


ప్రస్తుతం డంపింగ్ యార్డు వద్ద పేరుకు పోయిన చెత్త

తాండూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): చెత్తను కేవలం వ్యర్థమని భావిస్తే పొరపాటే. చెత్తతో సేంద్రియ ఎరువులు తయారు చేసి పంట పొలాలకు ఎరువులుగా మార్చుకోవచ్చు. గతంలో తాండూరు మున్సిపల్ కమిషనర్లుగా రమణాచారీ, బోగేశ్వర్లు పని చేసిన సమయంలో వినూత్నంగా సేంద్రియ ఎరువుల తయారీ కేంద్రాన్ని అందుబాటులోకి తెచ్చి సత్ఫలితాలను పొందారు. మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన రమణాచారి హయాంలో చెత్త డంపింగ్‌యార్డు వద్ద గ్రీనర్ పార్కు ఏర్పాటు చేయడంతో పాటు అప్పటి మున్సిపల్ పాలకవర్గాన్ని, మీడియాను మున్సిపల్ అధికారులను తీసుకెళ్లి వన భోజనాలు చేయించారు. తర్వాత 2009లో మున్సిపల్ కమిషనర్‌గా పని చేసిన బోగేశ్వర్లు హయాంలో స్వచ్ఛ సర్వేక్షణ్-2019 పోటీలో భాగంగా చెత్తసేకరణ నూతన విధానాన్ని అవలంభించారు. మున్సిపల్‌లో సేకరించిన చెత్తను డంపింగ్ యార్డులో అడ్డగోలుగా వేయకుండా తడి, పొడి చెత్తను వేర్వేరుగా డంపింగ్ చేస్తూ సేంద్రియ ఎరువును తయారు చేశారు. ఎందుకూ పనికిరాదనుకున్న చెత్తను భూసారం పెంచే విధంగా అప్పటి అధికారులు చర్యలు చేపట్టి విజయం సాధించారు. చెత్తాను సేకరించేందుకు అప్పట్లో 8 ట్రాక్టర్లు, 4 ఆటోలు, 12 తోపుడు బండ్లు, 6 రిక్షాలతో ప్రతీరోజు 40 మెట్రిక్ టన్నుల చెత్తను సేకరించేవారు. తాండూరు మండలం అంతారం గ్రామ పంచాయతీ పరిధిలోని ఆరెకరాల స్థలంలో చెత్తను డంపింగ్ చేసేవారు. డంపింగ్‌యార్డు నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టేవారు. డంపింగ్ యార్డులో కూరగాయల సాగు నిర్వహణ కూడా చేపట్టేవారు. డంపింగ్ యార్డులో సేంద్రియ ఎరువులను తయారు చేసేందుకు సింట్రో కంపోస్టు కేంద్రాన్ని ఏర్పాటుచేసి సేకరించిన యార్డుల్లో ప్రత్యేక గిడ్డంగులనూ ఏర్పాటు చేసి 20రోజుల వరకు చెత్తను ఆరబెట్టి తర్వాత జల్లెడ పట్టి ఎరువుగా మార్చేవారు. తయారు చేసిన సేంద్రియ ఎరువులను క్వింటాల్ రూ.800 నుంచి రూ.1000ల చొప్పున విక్రయించేవారు. ప్రస్తుతం డంపింగ్ యార్డులో చెత్తనిల్వలు పేరుకుపోయాయి. అప్పట్లో చెత్తను కంపోస్టు చేయడానికి వినియోగించిన యంత్రాలు ప్రస్తుతం కనిపించకుండా పోయాయి. చెత్తను కంపోస్టు ఎరువుగా తయారు చేసి వాటి విక్రయాల ద్వారా మున్సిపల్ ఆదాయాన్ని పెంచుకోవాలని శ్రద్ధచూపడం లేదు. వర్మీ కంపోస్టును తయారు చేయాలని నిర్ణయించినప్పటికీ ముందుకు సాగడంలేదు.

బల్దియాలో చెత్తను వినియోగించుకోవడం లేదు



తాండూరు బల్దియాలో అవినితిపైనే ప్రత్యేక దృష్టిపెట్టారు. ఇతర అభివృద్ధి పనులపై, డంపింగ్ యార్డులో చెత్తను సద్వినియోగం చేసుకోవడంలేదు. ప్రసుతం మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్‌గా ఉన్న విక్రమ్ సింహారెడ్డికి గతంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన అనుభవం ఉంది. అయినప్పటికీ ఆయనకు చెత్తపై చిత్తశుద్ధిలేదు. తాండూరులో సమర్థవంతంగా క్లీన్ అండ్ గ్రీన్ చేస్తున్నాడని భజన చేస్తున్నవారు తన వార్డుకు వస్తే అవినీతి ఏమేరకు జరుగుతుందో నిరూపించడానికి సిద్ధంగా ఉన్నా. - **ఆసిఫ్, కౌన్సిలర్**

వర్మీ కంపోస్టు తయారీకి నిర్ణయించాం



డంపింగ్ యార్డులో తడి చెత్త ఆధారంగా వర్మీ కంపోస్టు తయారు చేయాలని నిర్ణయించాం. ఇందుకు సంబంధించిన పరికరాలు సమకూర్చిన వెంటనే చెత్తను వర్మీ కంపోస్టుగా తయారు చేసి విక్రయిస్తాం. డంపింగ్ యార్డులో చెత్తను దశల వారీగా తొలగింపజేస్తాం. నాకు డంపింగ్ యార్డు ప్రక్షాళనకు పూర్తి బాధ్యతలు అప్పగిస్తే డంపింగ్ యార్డు రూపురేఖలు మార్చేస్తా.

- వెంకటయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్

కార్తీక వనభోజనాలు


వనభోజనాల్లో పాల్గొన్న మహిళలు

పూడూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం పురస్కరించుకుని దామగుండం శ్రీరామలింగేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేకాభి షేకాలు నిర్వహించారు. పరిగి పట్టణానికి చెందిన జంగం భువనేశ్వరి, బుచ్చిలింగం ఆధ్వర్యంలో స్వామి వారికి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం చేశారు. ఈ సందర్భంగా 11వేల దీపాలు వెలిగించి చేసిన దీపారాధన కార్యక్రమం అందరినీ ఎంతగానో ఆకట్టుకుంది. అనంతరం సామూహిక వన భోజనాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హరీశ్‌కుమార్, అనిల్‌కుమార్, అర్చకులు రాజశేఖర్, నవీన్, మనీశ్, మణిప్రశాంత్, రాజేశ్, ధీరజ్, చెన్నమల్లి, సాయి తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉంటే, కార్తీకమాసం పురస్కరించుకుని దామగుండం క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. వేలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకుని వన భోజనాలు చేశారు.

ఎదురుచూపులు!

(5వ పేజీ తరువాయి)

ఇప్పటికీ స్పష్టత ఇవ్వలేదు. ఈ క్రమంలో పాతరేషన్‌కార్డుల్లో కోత విధిస్తారా? కొత్త కార్డుల జారీకి ఎలాంటి ఆంక్షలు విధిస్తారు? అనేది కూడా తేల్చలేదు. కొత్తగా ఇచ్చే కార్డులు క్యూఆర్ కోడ్‌తో పకడ్బందీగా ఇవ్వాలని ప్రభుత్వం యోచిస్తోన్నట్లు సమాచారం. ఇప్పటికే జిల్లాలో 95 శాతం వరకు కేవైసీ పూర్తి చేయించారు. కాగా, ప్రస్తుతం జిల్లాలో 5,23,899 రేషన్ కార్డులున్నాయి.

కార్డుల కోతపై ఆందోళనలు!

గత ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డుల ప్రక్రియను నిలిపివేయడంతో జిల్లాలో వేలాది మంది ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం చౌకధర దుకాణంలో బియ్యం మాత్రమే అందిస్తుండగా వీటికి అదనంగా రానున్న రోజుల్లో నిత్యావసర సరుకులు సైతం పంపిణీ చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. వచ్చే ఏడాది జనవరి నుంచి సన్న బియ్యం అందించనున్నట్లు ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. ప్రజాపాలన ఆరు గ్యారెంటీల దరఖాస్తు సమయంలోనూ కార్డు కోసం అనేక మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇటీవల రుణమాఫీ సమయంలోనూ కార్డు లేని పట్టాదారులకు రుణమాఫీ వర్తించలేదు. ప్రస్తుతం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేతో కూడా ఇప్పటికే రేషన్ కార్డు ఉన్న లబ్ధిదారుల్లో ఆందోళన మొదలైంది. సర్వేలో తమ ఆస్తుల వివరాలు కూడా వెల్లడిస్తుండటం పట్ల ప్రభుత్వం కార్డుల్లో కోత పెడుతుందనే ప్రచారం జరుగుతోంది. సర్వే ఆధారంగానే కొత్త రేషన్ కార్డుల జారీ విషయం కూడా ఆధారపడి ఉంటుందని, సర్వేలోని వివరాల ద్వారానే కార్డులు జారీ చేస్తారనే ప్రచారం ముమ్మరంగా వినిపిస్తోంది.

సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం

తాండూరు, నవంబర్ 24 (ఆంధ్రజ్యోతి) : తాండూరుకు ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ మంజూరైన సందర్భంగా తాండూరు కాంగ్రెస్ నాయకులు అంబేడ్కర్ చౌక్‌లో సీఎం రేవంత్‌రెడ్డి తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.

యాలాల: తాండూరుకు ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరు చేయడం హర్షణీయమని మండల నాయకులు అన్నారు. వారు ఆదివారం తాండూరు అంబేడ్కర్ చౌరస్తాలో సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈఅ కార్యక్రమంలో అక్బర్‌బాబా, భీమయ్య, అమృతప్ప, జిలాని, ముస్తఫా, రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

ఐక్యంగా ఉండి పోరాడుతాం


సమావేశంలో ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి) : ఐక్యంగా పోరాడుతామని ఏకశీలనగర్ ప్లాట్స్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు అన్నారు. కొర్రెముల ఏకశీలనగర్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. తమ ప్లాట్లను అన్యాయంగా బిల్డర్ వెంకటేష్ కబ్జా చేయాలని ఏన్నోఏళ్ల నుంచి ప్రయత్నం చేస్తున్నారని, అన్ని కోర్టుల్లోనూ తామే గెలిచామని తెలిపారు. 1985లో ఏకశీలనగర్ వెంచర్ చేసి ప్లాట్లు ఏర్పాటుచేస్తే 2007లో వ్యవసాయ భూమిగా ఉందని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ప్లాట్లు లేనప్పుడు బిల్డర్ వెంకటేష్ హర్ష కన్‌స్ట్రక్షన్ పేరుమీద ఈ వెంచర్‌లోని ప్లాట్లు ఏలా కొనుగోలు చేశాడని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో మాణిక్యాల్‌రావు, జుబేర్, ముత్తారెడ్డి, శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సత్యనారాయణస్వామి బ్రహ్మోత్సవాలు


శామీర్‌పేట: స్వామివారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి, మండల బీఆర్‌ఎస్ నాయకులు

శామీర్‌పేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అలియాబాద్ చౌరస్తా సమీపంలోని వెలసిన శ్రీరమాసహిత సత్యనారాయణస్వామి ఆలయంలో ఆదివారం బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు పల్లె రాములుగౌడ్, తాళ్ల జగదీశ్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవాలకు మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే మల్లారెడ్డి, మాజీ జడ్పీటీసీ అనితలాలయ్యలు ముఖ్య అతిథిలుగా విచ్చేసి శ్రీసత్యనారాయణస్వామివారిని అత్యంత భక్తిశ్రద్ధలతో దర్శించుకుని ప్రత్యేకపూజలను చేశారు. ఎమ్మెల్యే మల్లారెడ్డిని ఆలయ వ్యవస్థాపకుడు, ధర్మకర్త పల్లె రాములుగౌడ్, తాళ్ళ జగదీశ్‌గౌడ్‌లు సన్మానించారు. పూజల్లో బీఆర్‌ఎస్ శామీర్‌పేట మండల అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, వంగ వెంకట్‌రెడ్డి, గుర్కకుమార్ పాల్గొన్నారు.

అయ్యప్ప పడిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే

మేడ్చల్ టౌన్: మేడ్చల్ పట్టణంలో నిర్వహించిన అయ్యప్ప స్వామి మహాపడి పూజలో స్థానిక ఎమ్మెల్యే మల్లారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణానికి చెందిన నవీన్‌రెడ్డి, నాగేందర్ రెడ్డిలు ఆదివారం నిర్వహించిన 18వ అయ్యప్ప మహా పడిపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక ఆహ్వానంపై ఎమ్మెల్యే మల్లారెడ్డి విచ్చేసి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు.

శామీర్‌పేట: మండలంలోని లాల్‌గడి మలకపేటలో సల్లూరి దశరథ స్వామి 18వ మహాపడి పూజను రాజు గురుస్వామి ఆధ్వర్యంలో సత్యం గురుస్వామి ఆదివారం మహాపడి పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా సల్లూరి దశరథ గురుస్వామి, అయ్యప్ప స్వాములు పంచామృతాలతో శ్రీఅయ్యప్ప స్వామికి అభిషేకం చేశారు. అదేవిధంగా మదన్‌మోహన్ భజన మండలి ఆధ్వర్యంలో 18 పడి మెట్లకు పూజలను చేశారు. ఈ కార్యక్రమానికి డీసీసీ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వైసగౌడ్, మాజీ సర్పంచ్ వనజాశ్రీనివాస్‌రెడ్డిలు పాల్గొన్నారు.

అయ్యప్ప పూజలో పాల్గొన్న ఎమ్మెల్సీ కవిత

కీసర రూరల్: దమ్మాయిగూడ మున్సిపాలిటీ ప్రజయ్‌సాయి గార్డెన్స్‌లో నివాసముంటున్న జాగృతి సంస్థ మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కన్వీనర్ విజయేందర్ ఆదివారం నిర్వహించిన అయ్యప్పస్వామి పూజా కార్యక్రమానికి ఎమ్మెల్సీ కవిత హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమెకు ఘన స్వాగతం పలికారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి తీర్థ ప్రసాదాలను, ఆశీర్వచానాలను ఆమెకు అందజేశారు.


కీసర రూరల్: అయ్యప్పస్వామి పూజలో ఎమ్మెల్సీ కవిత

బోనమ్మ మాతను దర్శించుకున్న అదనపు ఎస్పీ

తాండూరు: పాత తాండూరులో బోనమ్మ జాతర సందర్భంగా ఆదివారం నల్గొండ జిల్లా విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అదనపు ఎస్పీ మధుసూదన్‌రావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట జాతీయ బీసీ సంఘం కార్యవర్గ సభ్యుడు రాజ్‌కుమార్, రాష్ట్ర నాయకులు సుకూర్ ఉన్నారు.


బోనమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న అదనపు ఎస్పీ మధుసూధన్

రైతులు ఆర్థికంగా ఎదగాలన్నదే ప్రభుత్వ లక్ష్యం


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మొగులయ్య

కులకచర్ల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రైతులు ఆర్థికంగా ఎదగాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని సొసైటీ చైర్మన్ కనకం మొగులయ్య తెలిపారు. మండలంలోని తిరుమలాపూర్‌లో ఆదివారం పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం మండలంలోని పలువురు లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు బీఎస్.ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్, అంజిలయ్యగౌడ్, కొండయ్యగౌడ్, వెంకటయ్యగౌడ్, జలీల్, సత్యనారాయణ, ఉమాశంకర్, భూపాల్, చిన్నయ్య పాల్గొన్నారు.

రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దు

ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించొద్దని డీఎస్‌వో మోహన్‌బాబు తెలిపారు. కులకచర్లలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో మార్కెట్ యార్డులో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. ధాన్యం తూకాలు, రికార్డులను తనిఖీ చేశారు. ధాన్యం తూకం కాగానే ట్యాబ్‌లో నమోదు చేయాలని కేంద్రం నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ కనకం మొగులయ్య పాల్గొన్నారు.

బొంరాస్‌పేట్: ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ మేరకు సన్నరకం ధాన్యానికి రూ.500 బోనస్‌తో కొనుగోలు చేసేందుకు ముందుకు వచ్చిందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ తెలిపారు. బొంరాస్‌పేట్‌లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో సన్నధాన్యం వరి కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహులుగౌడ్, వెంకట్రాములుగౌడ్, వీరేశం, కృష్ణ, రైతులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ


లబ్ధిదారుడికి చెక్కు అందజేస్తున్న ఎంపీ

కీసర రూరల్, నవంబర్ 24 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరి చికిత్స పొందిన నాగారం మున్సిపాలిటీకి చెందిన పలువురికి ప్రభుత్వం నుంచి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆదివారం మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు పటోళ్ల విక్రమ్‌రెడ్డి, కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, ఆ పార్టీ నాయకులు రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓటు నమోదు చేసుకోవాలి

దోమ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): 18 సంవత్సరాలు నిండిన వారందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని ఎంపీడీవో మహేశ్‌బాబు అన్నారు. ఓటరు జాబితా సవరణలో భాగంగా ఆదివారం బాసుపల్లిలో ఓటు నమోదు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ నెల 28 వరకు ఆన్‌లైన్ ద్వారా అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నర్సింహులు, పంచాయతీ కార్యదర్శి రవి పాల్గొన్నారు.

మేడ్చల్ టౌన్: మేడ్చల్ మున్సిపల్ పరిధిలో ఆదివారం ఓటరునమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఓటు నమోదు చేసుకునే వారితో పాటు ఓటరు జాబితాలో తప్పుల సవరణ కోసం దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో బీఎల్‌ఓలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు, నాటి ఉపాధ్యాయులు

బషీరాబాద్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): గొట్టిగఖుర్దు జడ్పీ ఉన్నత పాఠశాలలో 1990-91 సంవత్సరంలో ఏడోతరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. 33 సంవత్సరాల తర్వాత కలుసుకున్న వారు యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వారికి విద్యాబుద్దులు నేర్పిన గురువులు జ్యోషి విశ్వనాథం, పాండయ్య, మృత్యుంజయస్వామి, వెంకటయ్య, మల్లమ్మ, అంబమ్మ, కోకిల, వసంత్‌కుమార్, బుగ్గయ్యలను పూలమాల, శాలువాతో సత్కరించారు. అదేవిధంగా మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, గ్రామ పెద్ద బాస్పల్లి శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డిలను పూర్వ విద్యార్థులు సత్కరించారు. అనంతరం సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పి.గుణవర్ధన్‌రెడ్డి, బి.శేఖర్, రాములునాయక్, ఎంపీ.రెడ్డి, మాధవరెడ్డి, టి.రాంచందర్, ఎం.ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మేడ్చల్ టౌన్/కీసర: మెడిసిటీ సబ్‌స్టేషన్ పరిధిలో చేపడుతున్న మరమ్మతుల కారణంగా సోమవారం(నేడు) ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు పేర్కొన్నారు. అదేవిధంగా కీసరలో నేడు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4.30గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ మురళీకృష్ణ ఓ ప్రకటన ద్వారా తెలిపారు.

విద్యార్థులకు కరాటే గ్రేడింగ్ పరీక్షలు

కొడంగల్ రూరల్: రావుల్‌పల్లి జడ్పీహెచ్‌ఎస్ పాఠశాల ఆవరణలో ఆదివారం కరాటే మాస్టర్ వెంకటయ్య విద్యార్థులకు కరాటే గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు విద్యార్థులకు ప్రశాంస పత్రాలు, బెల్టులు అందించారు. కరాటే మాస్టర్లు మహేశ్, నరేశ్, ప్రవీణ్, నాయకులు తార్యానాయక్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు విరాళం

పరిగి: ఖుదాంద్‌పూర్‌లో అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు బీఎంపి జిల్లా అధ్యక్షుడు పి.గట్యానాయక్ ఆదివారం కమిటీ బృందానికి రూ.30వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గోవింద్ నాయక్, జిల్లా కార్యదర్శి రవీందర్, నాయకులు హరి నాయక్, గణేశ్, ఆనంద్, రవీందర్, రాజు ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

కీసర: శ్రీశ్రీశ్రీ పరమ పూస్య మహా ప్రేమావతార స్వయంభూః ఆది పరబ్రహ్మ మహా గురు జైమహావిభోశ్రీః వారి అనుగ్రహంతో ఓమౌ జయాః ఆశ్రమం, ది సెలబ్రేటింగ్ పాత్ ఆఫ్ ఎన్లైటెన్మెంట్ ఆధ్వర్యంలో గోధుమకుంటలో ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. ఉస్మానియా ఆస్పత్రి వైద్యులు లక్ష్మీ కాంతం, ఇతర వైద్యబృందం కలిసి గ్రామస్థులకు వైద్య పరీక్షలు చేశారు.

మాలలు హక్కుల సాధనకై పోరాటం

ఘట్‌కేసర్ రూరల్: మాల మహానాడు జిల్లా ఉపాధ్యక్షుడు పడిగెం ఆంజనేయులు ఎదులాబాద్ అంబేడ్కర్ యువజన సంఘం వద్ద ఆదివారం మాలల పాదయాత్ర సింహాగర్జన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మురళీమోహన్, శివకుమార్, వెంకటేష్, సురేష్, నాగరాజు, లోకదాస్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

పరిగి: బర్కత్‌పల్లికి చెందిన రిటైర్డు పట్వారీ, మాజీ పీఏసీఎస్ చైర్మన్ నర్సింహారెడ్డి మృతి బాధాకరమని పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి అన్నారు. బర్కత్‌పల్లిలోని నర్సింహారెడ్డి కుటుంబాన్ని ఆదివారం ఆయన పరామర్శించారు. ఆయన వెంట పీఏసీఎస్ చైర్మన్ శ్యాంసుందర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఆర్.ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

కీసర రూరల్: డబుల్ బెడ్ రూం ఇళ్లను కేటాయించి 14నెలలు గడుస్తున్నా ప్రభుత్వం మౌలిక వసతులు కల్పించటం లేదనిదమ్మాయిగూడ మున్సిపాలిటీ అహ్మద్‌గూడలోని డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారులు ఆదివారం ఆందోళనకు దిగారు. ఈ కార్యక్రమంలో విజయ్‌కుమార్, పరశురాం, వెంకటేశ్వర్లు, వెంకటేష్, నర్సింగ్, జాన్, రవి, చందు పాల్గొన్నారు.

కురువ సంఘం మండల నూతన కమిటీ

కులకచర్ల: కురువ సంఘం మండల అధ్యక్షుడిగా భాస్కర్, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా రెడ్డిపల్లి రాములును ఆదివారం ఎన్నుకున్నారు.

కులగణన సర్వే డేటా ఎంట్రీ

దోమ: కులగణన సర్వే వివరాలను కలెక్టర్ ఆదేశానుసారం డేటా ఎంట్రీని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహిస్తున్నారు. ఎంపీడీవో మహేశ్‌బాబు, పంచాయతీ కార్యదర్శి రాజేశ్ పరిశీలించారు.

విద్యార్థులకు టీవీవీ నాయకుల అభినందన

బొంరాస్‌పేట్: నేషనల్ కం మెరిట్ స్కాలర్‌షిప్ అర్హత పరీక్షలు రాసిన బొంరాస్‌పేట్, కొడంగల్, దుద్యాల, దౌల్తాబాద్ తదితర ఉన్నత పాఠశాలల విద్యార్థులను టీవీవీ నాయకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో టీవీవీ నాయకులు రవీందర్‌గౌడ్, బాకారం చంద్రశేఖర్, గౌరారం గోపాల్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఇంజనీరింగ్ విద్యార్థిని అదృశ్యం


షేక్ సాజిత(ఫైల్)

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): హాస్టల్‌లో ఉంటున్న ఓఇంజనీరింగ్ విద్యార్థిని అదృశ్యమైంది. ఈ ఘటన పోచారం ఐటీకారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రాజువర్మ తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా, మట్టంపల్లి మండలం, యాటవాకిల్ల గ్రామానికి చెందిన షేక్‌సాజిత(19), పోచారం మున్సిపాలిటీ, యంనంపేటలోని ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటూ శ్రీనిధి ఇంజనీరింగ్ కళాశాలలో సీఎస్‌సీ 2వ సంవత్సరం చదువుతోంది. రోజూ మాదిరిగానే సాజిత కుటుంబసభ్యులు ఫోన్ చేస్తుండేవారు. అందులో భాగంగానే ఈనెల 19వ తేదీన సాయంత్రం నాలుగున్నరకు వాళ్ల బాబాయ్ ఎస్‌కే మస్తాన్ ఫోన్‌చేసి ఆమెతో కొద్దిసేపు మాట్లాడాడు. తిరిగి రాత్రి ఫోన్‌చేస్తే ఆమె ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో హాస్టల్ నిర్వాహకులకు సమాచారం ఇచ్చారు. నాలుగు రోజులు కళాశాలకు సెలవులు వచ్చాయని, తన అమ్మకు ఆరోగ్యం బాగాలేదని చెప్పి ఈనెల 7వ తేదీన సాయంత్రం 7.30గంటలకు సాజిత ఇంటికి బయల్దేరిందని హాస్టల్ నిర్వాహకులు తెలిపారు. దీంతో సాజిత కుటుంబసభ్యులు తెలిసిన వారిని, మిత్రులను, బంధువులను విచారించినా ఫలితం లేకపోవడంతో పోలీసులను ఆశ్రమించారు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ప్రమాదవశాత్తు ట్రాక్టర్‌కింద పడి డ్రైవర్ మృతి


ద్విచక్రవాహనాలను ఢీకొన్న ట్రాక్టర్

మేడ్చల్ టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు ట్రాక్టర్‌కింద పడి డ్రైవర్ మృతి చెందాడు. ఈ ఘటన మేడ్చల్ పోలీ స్టేషన్ పరిధి మునీరాబాద్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మునీరాబాద్ గ్రామానికి చెందిన జి.దేవేందర్(46) ఆదివారం ట్రాక్టర్ ఏయిర్ ఫిల్టర్ శుభ్రం చేయడానికి పెట్రోల్ బంకు వద్ద ట్రాక్టర్ ఆపి ఏయిర్ ఫిల్టర్ శుభ్రం చేసుకుని తిరిగి బిగించుకున్నాడు. అనంతరం ట్రాక్టర్ టైర్ ముందు నిలబడి ట్రాక్టర్ గేయిర్‌లో ఉన్న విషయం గమనించక సెల్ఫ్‌కొట్టి స్టార్ట్ చేయడంతో ట్రాక్టర్ ముందుకు కదిలి దేవేందర్ చక్రాల కింద పడి అక్కడికక్కడే మృతిచెందాడు. అనంతరం ట్రాక్టర్ అక్కడే ఉన్న ద్విచక్రవాహనాలను ఢీకొని ఆగిపోయింది. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు.

మద్యం మత్తులో కిందపడి వ్యక్తి..


వెంకటయ్య మృతదేహం

ధారూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో కిందపడి ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన ధారూరులో శనివారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్‌ఐ వేణుగోపాల్ గౌడ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కుక్కింద గ్రామానికి చెందిన కొనింటి వెంకటయ్య(35) మద్యానికి బానిసై జులాయిగా తిరిగేవాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి మద్యం మత్తులో ధారూరులోని బుగ్గాపురం నర్సింహులు ఇంటిముందు కిందపడిపోయాడు. కొంతసేపటి తర్వాత అనిల్ అనే వ్యక్తి వచ్చి వెంకటయ్యను లేపగా లేవలేదు. ఆయన పరీక్షించగా అప్పటికే మృతి చెందటంతో తండ్రి అనంతయ్యకు సమాచారం ఇచ్చాడు. మద్యం మత్తులో తన కుమారుడు కిందపడి మృతి చెందాడని తండ్రి అనంతయ్య ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

మాదక ద్రవ్యాలను విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

కీసర రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలను విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులకు ఎస్‌వోటీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన ఆదివారం కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. కీసర ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాజస్థాన్‌కు చెందిన శంతనరాం, జగదీష్‌లు నూతనంగా నిర్మిస్తున్న ఇళ్లల్లో రెయిలింగ్ వర్క్ చేసుకుంటూ దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధి అహ్మద్‌గూడలోని ఠాకూర్‌నగర్ కాలనీలో నివాసముంటున్నారు. అక్రమ సంపాదనకు వీరిద్దరూ మాదక ద్రవ్యాల విక్రయాన్ని చేపట్టారు. అందులో భాగంగా గుజరాత్‌కు చెందిన కమలేష్, రాజస్థాన్‌కు చెందిన దినేష్‌కలియన్‌లతో కలిసి ముఠాగా ఏర్పడ్డారు. రాజస్థాన్‌కు చెందిన మరో ముఠాతో చేతులు కలిపి అక్కడి నుంచి సేకరించిన మత్తు పదార్థాలను ఇక్కడ విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. కాగా విశ్వసనీయ సమాచారం మేరకు ఎల్బీనగర్ ఎస్‌వోటీ, కీసర పోలీసులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. శంతనరాం, జగదీష్‌లు పోలీసులకు పట్టుబడగా కమలేష్, దినేష్‌కలియన్‌లు పరారయ్యారు. వీరివద్ద నుంచి 10గ్రాముల హెరాయిన్, శ్రీతిరుపతి కొరియర్ ఖాళీ కవర్, బైక్, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కీసర పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నిబంధనలకు పాతర

(5వ పేజీ తరువాయి)

అనుమతుల కోసం కూడా ప్లాట్ల యజమానులు మున్సిపల్ కార్యాలయానికి వెళ్లడం లేదు. అలాగే మున్సిపల్ ప్రణాళిక విభాగ అధికారులు సైతం కరీంగూడలో నిర్మాణాల గురించి పట్టించుకోవడం లేదు. గ్రామం బల్దియాలో వీలినమై ఇన్ని రోజులవుతున్నా మున్సిపల్ ఉన్నతాధికారులు చర్యలు ఎందుకు తీసుకోవడం లేదోనని గ్రామస్తులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

నిర్మాణాలపై సమగ్ర విచారణ చేస్తాం



కరీంగూడలో చేపడుతున్న అన్ని నిర్మాణాలపై సమగ్ర విచారణ చేస్తాం. ఆశ్రమం వద్ద జరుగుతున్న నిర్మాణంపై పరిశీలించి రికార్డులు చూసి ఒకవేళ అనుమతి లేకుండా నిర్మిస్తున్నట్టు తేలితే రెండు, మూడు రోజుల్లో చర్యలు తీసుకుంటాం. వ్యాపారానికైనా, నివాసాలకైనా నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేస్తే కూల్చివేతలు తప్పవు.- **భాస్కర్‌రెడ్డి, కమిషనర్, నాగారం మున్సిపాలిటీ**

సీపీఎం మండల కార్యదర్శిగా సబిత

ఘట్‌కేసర్, నవంబరు 24 సీపీఎంఘట్‌కేసర్ మండల కార్యదర్శిగా ఎన్ సబిత 2వ సారి ఎన్నికయ్యారు. మండలంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన మండల మహాసభలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు పార్టీ నాయకులు ఓ ప్రకటనలో తెలిపారు. కమిటీ సభ్యులుగా యాదయ్య, శ్రీకాంత్‌రెడ్డి, చంద్రమోహన్, ఉదయ్, యాదగిరి, నాగమణి, అలివేలు ఎన్నికయ్యారు.

రేపు నిరసనలు

కొడంగల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో, బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై ఈనెల 26న (మంగళ వారం) సంయుక్త కిసాన్ మోర్చా జాయింట్ ప్లాట్‌ఫామ్ ఆఫ్ ట్రేడ్ యూనియన్, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల పిలుపు మేరకు నిరసనలు చేపట్టనున్నట్లు రైతు సంఘం జిల్లా కార్యదర్శి జీ. సురేశ్‌కుమార్ ఆదివారం పేర్కొన్నారు.